నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 8 అక్టోబర్ 2024 | NALGONDA

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు

సూర్యాపేట అర్బన్, అక్టోబర్ 7 : సూర్యాపేట జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి.భానునాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 6 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 8 పోస్టులకు నియామక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుంచి పీజీలో 50శాతం కనీస విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. మెరిట్ ప్రాతిపదికన నియామకం జరుగుతుందని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 7నుంచి 10 సాయంత్రం వరకు సూర్యాపేట డీఐఈఓ కార్యాలయంలో ఐడీఓసీ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఖాళీల ఆధారంగా భర్తీ చేస్తున్నట్లు దరఖాస్తు వెంట విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, కులం, స్టడీ, స్థానికత ధ్రువీకరణ పత్రాలు జత చేయాలన్నారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకానిమిక్స్, తుంగతుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఎంపీహెచ్ ఓడబ్ల్యూ, కోదాడ ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో ఇంగ్లిష్, కెమిస్ట్రీ, నేరేడుచర్ల ప్రభు త్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ఏనీపీ కోర్సు, మ్యాథ్స్, హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్, నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టులకు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్యేలు బాలునాయక్, జయవీర్‌రెడ్డి

ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ధ్యేయం

- రెండేండ్లలో ఎస్ఎల్‌బీసీ పూర్తికి కృషి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- దేవరకొండ నూతన మార్కెట్ కమిటీతో ప్రమాణ స్వీకారం

చందంపేట(దేవరకొండ), అక్టోబర్ 07 : నల్లగొండ జిల్లాలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం దేవరకొండ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, జైవీర్‌రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండేది వ్యవసాయ మార్కెట్ కమిటీ అన్నారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, దేవరకొండ ప్రాంతంతో పాటు జిల్లాలో ఉన్న నకిరేకల్, మునుగోడు, సాగర్ నియోజకవర్గాలకు పూర్తి స్థాయిలో సాగు, తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2005 నుంచి ఎస్ఎల్‌బీసీ సొరంగం ద్వారా సాగు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. 40 కిలోమీటర్ల మేర మేర సొరంగం పనులు పూర్తి కాగా మరో 9.5 కి.మీ. మేర పనులు మిగిలి ఉన్నాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అమెరికా నుంచి తెప్పించి మెషన్లతో 30 నెలల్లో ఎస్సెల్బీసీ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.18వేల కోట్లు రైతులకు రుణమాఫీ చేశామని, మిగిలిన వారికి త్వరలోనే పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటాని తెలిపారు. నల్లగొండ జిల్లాలో రోడ్ల కోసం ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.516 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ అంగడిపేట-పీఏపల్లి రహదారి లైనింగ్ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి గ్రామానికీ బీటీ రోడ్డు వేసి డబుల్ రోడ్డుకు విస్తరించాలని కోరారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ జముున మాధవరెడ్డి, వైస్ చైర్మన్ సర్వయ్యయాదవ్‌తోపాటు పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే బాలునాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేసీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీరాములు, ఏడీ శారద, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, ముక్కమల వెంకటయ్యగౌడ్, జాన్ యాదవ్, దేవేందర్‌నాయక్, హనుమంతు వెంకటేశ్‌గౌడ్, అరుణసురేష్‌గౌడ్, కొర్ర రాంసింగ్‌నాయక్, హరికృష్ణ, యూనస్, పాపానాయక్, బిక్కు నాయక్, బద్యానాయక్, దేవేందర్‌నాయక్, మాధవరెడ్డి, రుక్మారెడి గోపాల్‌రావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు కాంగ్రెస్ సర్కారు అన్యాయం చేసింది. కొత్త పథకాలు అమలు చేయకపోగా.. ఉన్న పథకాలకు పాతర వేస్తున్నది. ఉచిత చేపల పిల్లల పంపిణీని కుదించింది. గతేడాదితో పోలిస్తే చెరువుల్లో నీళ్లు లేవనే సాకుతో ఈసారి సీడ్‌ను సగానికి సగం తగ్గించింది. దాంతో మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోనున్నారు. మంగళ వారం నుంచి జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానుండగా, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ)

ఉచిత చేప పిల్లలు సగమే

50శాతానికి తగ్గించిన కాంగ్రెస్ ప్రభుత్వం

గతేడాది బీఆర్ఎస్ హయాంలో 3 కోట్ల సీడ్ పంపిణీ

- ఈ ఏడాది 1.5 కోట్లకు కుదించిన వైనం
- పోయినసారి 650 చెరువులు.. ఈసారి 450 మాత్రమే..
- చెరువుల్లో నీళ్లు లేవంటూ సర్కారు సాకులు
- మత్స్య కార్మికుల ఉపాధికి గండి..
- నేటి నుంచి చేప పిల్లల పంపిణీ

గతంలో కేసీఆర్ ప్రభుత్వం వృత్తిదారులకు ఊతం ఇచ్చింది. మత్స్యకారులు ఎదిగేందుకు అన్ని రకాలుగా అండగా నిలిచింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేనివిధంగా వంద శాతం సబ్సిడీతో ఉచిత చేపల పిల్లలను అందించింది. మత్స్యకారుల కుటుంబాల్లో వెలుగులు నింపింది. 2016లో ఈ ప్రారంభమైన కార్యక్రమం గతేడాది వరకు నిర్విరామంగా కొనసాగింది. ఎనిమిది విడుతలుగా ఉచిత చేప పిల్లలు పంపిణీ చేపట్టింది. ఉచిత చేప పిల్లల పంపిణీతో ఏటా ఉత్పత్తి పెరుగుతూ వచ్చింది. ఈ ఏడాది మాత్రం కాంగ్రెస్ సర్కారు ఉచిత చేప పిల్లల పంపిణీపై ఫోకస్ పెట్టలేదు. ఇప్పటికే చెరువుల్లోకి సీడ్ వదలాల్సి ఉండగా, ఇంకా టెండర్లు పూర్తి కాలేదు.

సగానికి తగ్గించిండ్రు..

కేసీఆర్ హయాంలో సక్రమంగా సాగిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం కాంగ్రెస్ సర్కారులో చతికిలాపడింది. ఈసారి ఉచిత చేప పిల్లల పంపిణీ సగానికి తగ్గించారు. జిల్లాలో రెండు రకాల చేప పిల్లలను చెరువుల్లో వేసేవారు. గతేడాది 3 కోట్ల చేప పిల్లలను చెరువుల్లోకి వదిలారు. అందులో రూ.2 కోట్లు పెద్ద చేప పిల్లలు, కోటి చిన్న పిల్లలు ఉన్నాయి. కానీ ఈ సారి మాత్రం 1.5 కోట్లకు కుదించారు. ఇందులో 80మిల్లీమీటర్ల సైజ్ ఉన్న చేపల పిల్లలు కోటి కాగా, 35 మిల్లీమీటర్ల సైజ్‌వి 50 లక్షలు వేయాలని నిర్ణయించారు. పెద్ద సైజ్‌కు టెండర్లు పూర్తయ్యాయి. చిన్న వాటికి టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

450 చెరువుల్లోనే సీడ్..

జిల్లాలో సుమారు 800కిపైగా చెరువులు ఉన్నాయి. కొన్నేండ్లుగా కొన్ని చిన్న చెరువులు పోగా.. ఏటా 650 చెరువుల్లో చేప పిల్లలను వదులుతున్నారు. ఈసారి పరిస్థితి మారింది. 450 చెరువుల్లోనే సీడ్ వేయాలని సర్కారు నిర్ణయించింది. చెరువుల్లో నీరు లేకపోవడంతో చెరువుల సంఖ్యతోపాటు సీడ్ తగ్గిందని అధికారులు చెబుతున్నారు. సీడ్ వేయాలంటే మినిమమ్ సీడ్ ఉండాలని చెప్పుకొస్తున్నారు. నారాయణపురం, కాచారం, మాసాయిపేట తదితర చెరువుల్లో నీళ్లు లేవని తెలియజేస్తున్నారు.

మత్స్యకారుల ఉపాధికి గండి..

బీఆర్ఎస్ పాలనలో మిషన్ కాకతీయ కార్యక్రమంలో భాగంగా చెరువుల్లో పూడికతీత చేపట్టారు. దాంతో చెరువులు జలకళను సంతరించుకుని నిండుకుండలా తొణికిసలాడాయి. ఉచిత చేపల పిల్లల పంపిణీతో ఎంతో మందికి ఉపాధి లభించింది. మత్స్యకారులు ఆర్థికంగా నిలదొక్కకుననారు. జిల్లాలో 186 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వాటి ద్వారా 10వేల మంది వరకు మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. వీరే కాకుండా సభ్యత్వాలు లేనివారు, పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభిస్తున్నది. కానీ ఇప్పుడు చెరువులు, సీడ్ సంఖ్య తగ్గడంతో మళ్లీ మత్స్యకారుల ఉపాధికి గండి పడనున్నది. తక్కువ సీడ్‌తో లాభాలు కూడా తగ్గిపోనున్నాయి.

నేటి నుంచి పంపిణీ..

ఉచిత చేప పిల్లల పంపిణీకి మంగళవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేప పిల్లలను చెరువులోకి వదలనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం చెరువులను పరిశీలించారు. అవసరమైన ఏర్పాట్లు చేశారు.



చిట్యాలలో రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రైతులందరికీ భేషరతుగా రుణమాఫీ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల, అక్టోబర్ 7 : ఎన్నికల ముందు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం భేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలంటూ సోమవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులకే కాదు మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులపై దాడులు చేస్తే కింది నాయకులు బయటకు రారనే భ్రమలో కేటీఆర్, హరీశ్ రావుపై దాడులకు పాల్పడుతున్నారని, ఇది ఉద్యమ పార్టీ అని, ఎన్ని దౌర్జన్యాలు ఎదురైతే అంత బలపడుతుందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సీఎం అనే హుందాతనాన్ని మరిచి వీధి మనిషిలా చిల్లర భాష ఉపయోగిస్తున్నారన్నారు. రైతులకు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ 10 నెలలు దాటినా మాఫీ చేయకుండా రకరకాల కొర్రీలు పెడుతున్నదని దుయ్యబట్టారు. మహిళలకు ఇచ్చిన హామీలను కూడా తుంగలో తొక్కారని, ప్రభుత్వంలోని ఓ మహిళా మంత్రి తోటి మహిళ వ్యక్తిగత జీవితంపై నిందారోపణలు చేస్తే ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కొండా సురేఖను వెంటనే ప్రభుత్వం నుంచి, కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడులు, దౌర్జన్యాలు చేయడం, పోలీస్ స్టేషన్లలో పైరవీలు చేయడంతోనే కాంగ్రెస్ నేతలు కాలం గడుపుతున్నారని విమర్శించారు. ధర్నాలో చిట్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్ఎస్ నాయకులు రాచకొండ కిష్టయ్య, కొలను వెంకటేశ్, సుంకరి యాదగిరి, మర్ల రాంరెడ్డి, దేవరపల్లి సత్తిరెడ్డి, కోయగూర నర్సింహ్మ, అయిలయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, గోధుమ గడ్డ జలంధర్‌రెడ్డి, కొలను సతీశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ శిలాఫలకం ధ్వంసం

ధ్వంసమైన తుంగతుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ శిలాఫకం

తుంగతుర్తి, అక్టోబర్ 07 : నియోజకవర్గ కేంద్రంలోని వెంపటి రోడ్డులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయల నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం శిలాఫకాన్ని గుర్తుతెలియని ధ్వంసం చేశారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు స్థానికంగా ఉండేందుకు క్యాంపు కార్యాలయాలను నిర్మించింది. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ 2023 అక్టోబర్4న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో ప్రసుత్తం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక శిలాఫకాన్ని ధ్వంసం చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు పాల్పడ్డ దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆలయాల ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

రామగిరి, అక్టోబర్ 7: జిల్లాలో దేవాదాయశాఖ ఆదీనంలో ఉన్న పలు ఆలయాల్లో కొత్త పాలకమండలి (ధర్మకర్తల మండలి) ఏర్పాటు కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ అన్నెపర్తి సులోచన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 17 ఆలయాలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మకర్తలుగా ఉండేందుకు ఆసక్తి ఉన్న వారు 20 రోజుల్లోపు దేవాదాయశాఖ జిల్లా కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు.

నోటిఫికేషన్ జారీచేసిన ఆలయాలు

కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం, బాల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం చిట్యాల, సీతారామచంద్ర స్వామి దేవాలయం పేరేపల్లి చిట్యాల మండలం, వేణుగోపాల స్వామి దేవాలయం వట్టిమర్తి చిట్యాల మండలం, రామలింగేశ్వర స్వామి ఆలయం గుండ్రాంపల్లి, చిట్యాల మండలం, ఆంజనేయస్వామి దేవాలయం ఈదూలూరు కట్టంగూర్ మండ లం, లక్ష్మీ నారాయణస్వామి దేవాలయం కట్టంగూరు, శివ మహాదేవ ఆలయం కాసనగోడు, కేతేపల్లి మండలం, వేంకటేశ్వర స్వామి ఆలయం గుడివాడ కేతేపల్లి మండలం, ఆంజనేయస్వామి దేవాలయం మంగలపల్లి నకిరేకల్ మండలం, శంభు లింగేశ్వరస్వామి దేవాలయం చందుపట్ల నకిరేకల్ మండలం, లింగమంతుల స్వామి దేవాలయం నెల్లిబండ, నకిరేకల్ మండలం, గోరక్షక స్వామి దేవాలయం, గోరేంకలపల్లి నకిరేకల్, విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నకిరేకల్ , లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం శాపల్లి నార్కట్‌పల్లి మండలం, ఆంజనేయస్వామి దేవాలయం ఎల్లారెడ్డి గూడెం నార్కట్‌పల్లి, వేణుగోపాలస్వామి దేవాలయం నార్కట్‌పల్లి

దామరచర్ల సిమెంట్ పరిశ్రమ పరిశీలన

రామన్నపేట, అక్టోబర్ 7 : దామరచర్ల మండలం గణేపహాడ్ గ్రామంలో ఇటీవల అదానీ కొనుగోలు చేసిన పెన్నా సిమెంట్ పరిశ్రమను రామన్నపేట అఖిలపక్ష నాయకులు సోమవారం పరిశీలించారు. రామన్నపేట రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేయబోతున్న అంబుజా సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ అక్కడి గ్రామాల పరిస్థితి, కాలుష్య స్థితిని అధ్యయనం చేసేందుకు అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ పెన్నా సిమెంట్ పరిశ్రమ కాలుష్యకారకంగా ఉందన్నారు. పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాలైన గణేశ్‌పహాడ్, శూన్యంపహాడ్, జాన్‌పహాడ్ గ్రామాల ప్రజలు వాయు కాలుష్యం మూలంగా రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. అక్కడ ఇండ్లల్లో ఉండే పరిస్థితి కూడా లేదని పేర్కొన్నారు. పరిశ్రమ లోపల దుమ్ముదూళితో ఊపిరి తీసుకోలేని దుస్థితి ఉందన్నారు. రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటైతే దామరచర్ల పరిసర గ్రామాల పరిస్థితే ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

దామరచర్లలో సిమెంట్ పరిశ్రమను పరిశీలిస్తున్న రామన్నపేట అఖిలపక్ష నాయకులు

సదస్సులో సూర్యాపేట మున్సిపాలిటీ వేస్ట్ ప్లాస్టిక్‌తో తయారు చేసే టైల్స్, మ్యాట్స్‌ను చూపుతున్న అధికారులు

అమలు కాని హామీలతో మోసం : సీపీఎం

మాట్లాడుతున్న కొలిశెట్టి యాదగిరిరావు

తుంగతుర్తి, అక్టోబర్ 7 : ఓట్ల కోసం అమలు కానీ హామీలిచ్చి ప్రజలను పాలకులు మోసం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ మహాసభలో పాల్గొని మాట్లాడారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధిహామీ కూలీ పెంచాలని, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలన్నారు. దేశంలో అధికారంలో వచ్చిన బీజేపీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతి ఒక్కరికీ రూ.15లక్షలు బ్యాంక్ అకౌంట్‌లో వేస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా ఇచ్చి మోసం చేస్తున్నదని తెలిపారు. రుణమాఫీ రాష్ట్రంలో 40శాతం మాత్రమే అయ్యిందని, రైతు భరోసా ఊసేలేదని విమర్శించారు. అనంతరం గ్రామశాఖ కార్యదర్శిగా ఉప్పుల సోమయ్యను ఎన్నుకున్నారు. సీపీఎం నాయకులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, ఉప్పలయ్య, తాటి విజయమ్మ, గడ్డం ఎల్లయ్య, సోమయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

కేజీబీవీల్లో అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తులు

సూర్యాపేట అర్బన్, అక్టోబర్ 7 : జిల్లాలోని కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అకౌంటెంట్, ఏఎన్ఎం పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు నేటి నుంచి ఈ నెల 14 వరకు దరఖాస్తుతోపాటు విద్యార్హత కలిగిన ధ్రువీకరణ పత్రాలతో జిల్లా కేంద్రం జమ్మిగడ్డ లోగల జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల విద్యా వనరుల కేంద్రంలో సమర్పించాలని పేర్కొన్నారు. అకౌంటెంట్ పోస్టులకు డిగ్రీలో బీకాం కామర్స్, కంప్యూటర్ నైపుణ్యం, ఏఎన్ఎం పోస్టులకు ఏఎన్ఎం శిక్షణ పొంది ఉండాలని తెలిపారు.

కుమారుడిని చంపి తల్లి ఆత్మహత్య

- భూదాన్‌పోచంపల్లిలో విషాదం

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 7 : ఐదేండ్ల వయస్సు గల కుమారుడిని చంపి ఓ తల్లి ఆత్మహత్యకు చేసకున్నది.భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావుపల్లి గ్రామంలో సోమవారం ఈ విషాదం చోటుచేసుకుంది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దరావులుపల్లి గ్రామానికి చెందిన జడల రాజుయాదవ్, అదే గ్రామానికి చెందిన పూల సోని (28) పది సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఏడేండ్ల వయస్సు గల చింటు, ఐదేండ్ల రేయాన్స్.. ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజు యాదవ్ శుభకార్యాలకు డెకరేషన్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాజుయాదవ్ డెకరేషన్ పని మీద బయటకు పోగా, అత్తమామలు బీబీనగర్ మండలం చిన్నరావులపల్లిలో బంధువుల ఇంట్లో దశదిన కర్మకు వెళ్లారు. ఒంటరిగా ఉన్న సోని మధ్యాహ్నం బయట ఆడుకుంటున్న తన ఇద్దరు కొడుకులను ఇంట్లోకి పిలిచింది. చిన్న కుమారుడు రియాన్స్ ఇంట్లోకి వెళ్లగా, పెద్ద కుమారుడు చింటు మాత్రం స్నేహితులతో ఆడుకుంటూ వెళ్లలేదు. సోనీ ఇంటి లోపల నుంచి గడియ పెట్టుకుని రేయాన్స్ ముక్కు, నోరు మూసి.. గొంతు నులిమి చంపింది. అనంతరం చున్నీతో ఆమె ఉరి పోసుకున్నది. భర్త రాజుయాదవ్ భోజనానికి ఇంటికి వచ్చి భార్యను పిలిచినా పలుకకపోవడంతో కంగారు పడ్డారు. లోపల నుంచి గడియ పెట్టి ఉండటంతో అమాంతం తలుపు లేపి లోపలికి వెళ్లి చూడగా సోని ఉరి వేసుకుని చనిపోయి ఉంది. భార్య, కుమారుల మృతదేహాలను భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందిన తల్లీకొడుకు

అంతర్జాతీయ సదస్సులో సూర్యాపేట మున్సిపాలిటీకి ప్రశంసలు

- తెలంగాణాలో 142 మున్సిపాల్టీల్లో సూర్యాపేటకు దక్కిన గౌరవం

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 7 : ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్-2024 సదస్సులో సూర్యాపేట మున్సిపాలిటీకి ప్రశంసలు దక్కాయి. ఇక్కడ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను ప్రముఖులు ప్రశంసించారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన సదస్సులో సూర్యాపేట మున్సిపాలిటీ చేపట్టిన సింగిల్ యూస్ ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌ను ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమాటిక్స్ చైర్మన్ డాక్టర్ కె.మృత్యుంజయరెడ్డి, సెక్రటరీ డాక్టర్ టి.విజయలక్ష్మి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జేఎన్టీయూ హైదరాబాద్ రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులను సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు పరిశీలన కోసం సూర్యాపేటకు పంపిస్తామన్నారు.

మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికపై సూర్యాపేట మున్సిపాలిటీ గురించి ప్రస్తావించడం హర్షణీయమన్నారు. తెలంగాణలోని 142 మున్సిపాల్టీల్లో ఏ మున్సిపాల్టీకీ దక్కని గౌరవం సూర్యాపేటకు దక్కిందన్నారు. పాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో సూర్యాపేట మున్సిపాలిటీ ఆర్ఆర్ఆర్ మోడల్.. రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ విధానాన్ని పాటిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీ కృష్ణారెడ్డి, సింగరేణి అడిషనల్ మేనేజర్ జి.సురేశ్, మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సీహెచ్ శివప్రసాద్, సైంటిస్టులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.